**73**
**ధారావాహిక**



# జాయ సేనాపతి

**చారిత్రక కాల్పనిక నవల**

మత్తి భానుమూర్తి
99893 71284

**జరిగిన కథ :** జాయపుడు, కాకతి.. అనుమకొండలో స్వేచ్ఛగా విహరిస్తున్నారు. తన మిత్రబృందానికి కాకతిని పరిచయం చేశాడు జాయపుడు. ఒకనాడు శిల్ప కర్మశాలకు తీసుకువెళ్లాడు. అక్కడ ఓ మిథున శిల్పాన్ని చూసి ఆశ్చర్యపోయింది కాకతి. 'ఈ శిల్పంలోని యువకుడు అచ్చం నీలాగే ఉన్నాడు!' అని కాకతి చెప్పగా.. ఆ శిల్పంలోని యువతి నర్తకి రేచమ అనీ.. తామిద్దరం ఈ భంగిమలో ప్రతీకలుగా నిలబడితే చిత్రకారులు చిత్రీకరించారని చెప్పాడు జాయపుడు. అంతే! ఆ మాటలు వినగానే కాకతి కోపంతో ఊగిపోయింది. విసురుగా బయటికి పరుగు తీసింది. ఏం చెయ్యాలో తోచక బిక్కచచ్చిపోయాడు జాయపుడు.

ఆమెకోసం అక్కడా ఇక్కడా అశ్వంపై తిరుగుతున్నాడు జాయపుడు.

ఈ అనుబంధం, ఈ అభిప్రాయభేదాలూ ఇద్దరికీ కొత్త. ఆమెను ఎలా సముదాయించాలో అతనికి తెలియదు. ఆమె కోపం తాత్కాలికమా!? అతను పెద్దతప్పు చేశాడా!? చిన్నతప్పు చేశాడా!? అసలు సజీవ ప్రతీకలుగా ఓ అమ్మాయితో కలసి నిలబడటం తప్పా.. ఒప్పా!?.. తప్పు అయితే అది అతణ్ని వదులుకునేటంత తప్పా!? ఏమో.. ఇదమిత్థంగా ఆమెకూ తెలియదు.

ఇద్దరూ బెంబేలెత్తిపోయారు.

ఆయన మరో స్త్రీతో అంత సన్నిహిత భంగిమలో ప్రతీకగా ఉండటం.. కాకతి ఏమాత్రం క్షమించలేకపోయింది.

ఈ ప్రతిష్ఠంభన పక్షంరోజులు చాలా గట్టిగా ఉంది. ఎవ్వరూ తగ్గలేదు. తగ్గడం ఎలాగో ఇద్దరికీ తెలియదు.

ఈ సమస్యను ఎలా పరిష్కరించాలో తెలియక కిందామీదా అవుతున్నారు మిత్రబృందం. నాగంభట్టు, త్రిపుర సెట్టికి ఇలాంటి సమస్యలు తీర్చిన అనుభవం లేదు. పెద్దలు నిర్ణయించిన వివాహాలు చేసుకున్న బుద్ధిమంతులైన కుటుంబీకులు వాళ్లు. భార్యతో అలగడాలు, భీష్మించుకోవడాలు అన్నీ ఇంటిలోపలే గానీ బయట కాదు. స్త్రీ పురుష సంబంధాలలో వివాహమే అత్యుత్తమ వ్యవస్థ. పెద్దలు నిర్ణయించి.. బాల్యంలోనే వివాహం జరిపించేసి, ఆనక వయసు వచ్చాక అత్తవారింటికి పంపడం ఆనవాయితీ. రాజకుటుంబీకులలో అమ్మాయిల విద్య, విషయ పరిజ్ఞానస్థాయి ఎక్కువ గనుక.. యుక్తవయసు వచ్చాకే వివాహాలు జరిగేవి.

పోషించగల స్థాయున్న మగవాడు ఎన్ని పెళ్లిళ్లయినా చేసుకోవచ్చు.

రెండో సంబంధం.. వేశ్యా సమాగమం.

వేశ్యా వ్యవస్థ పన్ను వసూలుస్థాయి వృత్తి. వేశ్యాస్త్రీలకు సమాజంలో సాంఘిక గౌరవం పక్కనబెడితే.. సామాజిక హోదా ఉన్నది.

'ఆమె నా వేశ్య!' అని చెప్పుకోవడం మగరాయుళ్లకు, 'వారు మాకు అయినవారు' అని వేశ్యలు చెప్పుకోవడం సర్వసాధారణం.

ఇక స్త్రీపురుషుల మధ్య స్నేహం, దగ్గరితనం తాత్కాలిక మాధుర్యమే కానీ, సాంఘిక హోదా లేనిది.

జాయపుడు, కాకతిల మధ్య ఏర్పడిన సమస్య.. ఊహాతీతంగానే సమస్య వచ్చినంత వేగంగా సడలిపోయింది. కాకతి నాట్యగురుకులం తరగతికి హాజరయ్యింది. వెంటనే అశోకుడు జాయపునికి కబురు తెలిపాడు. ఆగమేఘాలమీద వచ్చి పడ్డాడు.

చూశాడు. ముఖం తిప్పుకొన్నది. చిరునవ్వు నవ్వాడు. తిరిగి నవ్వలేదు. పెద్దగా నవ్వాడు.. దూరంగా కూర్చుంది. పక్కన కూర్చోబోయాడు. లేచి